
సాక్షి
యాదాద్రి భువనగిరి
సోమవారం । 20 । మార్చి । 2023



బండి సంజయ్‌కి అవగాహన లేదు
బండి సంజయ్‌కు రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై అవగాహన లేదని విప్ గొంగిడి సునీత విమర్శించారు.
- 8లో



కొలనుపాకకు కొత్త శోభ
ఆలేరు మండలం కొలనుపాకలోని సోమేశ్వరాలయం తొలి దశ పునరుద్ధరణ పనులు పూర్తి కావొచ్చాయి.
- 10లో

గరిష్టం/కనిష్టం
31°/19°

వాతావరణం
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మధ్యాహ్నం ఆహ్లాదకరంగా ఉంటుంది. అక్కడక్కడ వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

అంగన్‌వాడీ కేంద్రాలకు నేటి నుంచి ఒంటిపూట

భువనగిరి టౌన్ : వేసవి దృష్ట్యా సోమవారం నుంచి జూన్ 1వ తేదీ వరకు అంగన్‌వాడీ కేంద్రాలను ఒంటి పూట నిర్వహించనున్నారు. ఈ మేరకు శిశు సంక్షేమ శాఖ అధికారులు ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉదయం 8నుంచి మధ్యాహ్నం 12.30 వరకు అంగన్‌వాడీ కేంద్రాలను తెరిచి ఉంచాలన్నారు. ఆ తర్వాత వార్షిక సర్వే, గృహ సందర్శనలు, పిల్లలను ప్రీ స్కూల్‌లో నమోదు డ్రాపౌవుట్‌లు తదితర పనులు చేయాల్సి ఉంటుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

ముత్యాల తలంబ్రాలు బుకింగ్



ప్రభుత్వ విప్ గొంగిడి సునీతకు రశీదు అందజేస్తున్న కార్గో ఏజెంట్

యాదగిరిగుట్ట : భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి కల్యాణం ముత్యాల తలంబ్రాలను ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి కార్గో సర్వీస్ ద్వారా ఆదివారం బుక్ చేసుకున్నారు. 10 టికెట్‌లను బుక్ చేసుకొని భక్తిని చాటుకున్నారు. శ్రీస్వామివారి కల్యాణోత్సవానికి వెళ్లలేని భక్తులు కార్గో సర్వీస్ ద్వారా ముత్యాల తలంబ్రాలు బుకింగ్ చేసుకోవచ్చని యాదగిరిగుట్ట ఆర్టీసీ డిపో కార్గో ఏజెంట్ మీసాల ఉప్పలయ్య తెలిపారు.

డిమాండ్ల సాధనకు ఐక్య పోరాటం



మాట్లాడుతున్న రాష్ట్ర కన్వీనర్ రాములు

భువనగిరి : ప్రభుత్వం వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఐక్య పోరాటం చేయనున్నట్లు వీఆర్‌ఏల జేఏసీ రాష్ట్ర కన్వీనర్ వంగూరి రాములు తెలిపారు. ఆదివారం భువనగిరిలోని ఎస్వీ కాన్ఫరెన్స్‌హాల్ నిర్వహించిన వీఆర్‌ఏ జిల్లా జేఏసీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పే స్కేల్ అమలు చేస్తామని మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా మంత్రి కేటీఆర్, అంతకు ముందు సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారని, నెలలు గడిచినా ఆ ఊసే ఎత్తకపోవడం బాధాకరం అన్నారు. వీఆర్‌ఏలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని, ఉద్యమాన్ని ఎవరైనా తప్పుదారి పట్టిస్తే సహించేదిలేదన్నారు. అనంతరం వీఆర్‌ఏల జేఏసీ నూతన చైర్మన్‌గా పసుల రమేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర జేఏసీ కో కన్వీనర్లు రఫీ, మాదవ్, జిల్లా జేఏసీ గౌరవ అధ్యక్షుడు మల్లేశం, నాయకులు మాదవి, శ్రీను,పామి, నరసింహ, అన్ని మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

గ్రామీణ కళల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రచయిత డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య

చౌటుప్పల్ : గ్రామీణ కళలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ప్రముఖ రచయిత, కవి డాక్టర్ కూరెళ్ల విఠలాచార్య పేర్కొన్నారు. చౌటుప్పల్ పట్టణానికి చెందిన గ్రామీణ కళల పరిరక్షణ సేవా సమితి ప్రతినిధులు ఆదివారం ఆయనను కలిశారు. ఉగాది రోజున నిర్వహించే యక్షగాన కళాప్రదర్శన ఆహ్వానపత్రిక అందించారు. ఈ సందర్భంగా విఠలాచార్య మాట్లాడుతూ గ్రామీణ కళలు నానాటికి ఆదరణ కోల్పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. వాటిపై ప్రజల్లో ఆసక్తిని పెంచి పూర్వ వైభవం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కళల పరిరక్షణ కోసం యువత ముందుకు రావడం శుభపరిణామమన్నారు. అంతకుముందు పట్టణంలో సేవా సమితి అష్టమ వార్షికోత్సవ కరపత్రాలను ఎస్‌ఐ అనిల్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు పోలోజు శ్రీధర్‌బాబు, ప్రతినిధులు ఎరుకల మల్లేశం, చిక్క నర్సింహ్మా, వీసం చంద్రారెడ్డి, దొడ్డి రాములు, చిట్టిప్రోలు వెంకటేశం, నల్ల పర్వతాలు తదితరులు పాల్గొన్నారు.

నృసింహుడికి నిత్యారాధనలు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం నిత్యారాధనలు శాస్త్రోక్తంగా కొనసాగాయి. వేకువజామున ప్రధానాలయాన్ని తెరిచిన ఆచార్యులు సుప్రభాతం చేపటారు. అనంతరం స్వయంభూలకు బిందే తీర్థం, అరాధన, బాలభోగం, నిజాభిషేకం, సహస్రనామార్చన నిర్వహించి తులసీ దళాలతో అర్చించారు. అదే విధంగా ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజ వాహన సేవ, నిత్య కల్యాణం, జోడు సేవలు జరిపించారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం నిర్వహించి ఆలయాన్ని ద్వారబంధనం చేశారు.



స్వామివారికి హారతినిస్తున్న ఆచార్యులు



ఆలయ తిరువీధుల్లో కిక్కిరిసిన భక్తులు

బౌద్ధభిక్షువుకు వీడ్కోలు

నాగార్జునసాగర్ : బుద్ధవనంలో 15 రోజులుగా ధమ్మ ప్రవచనాలను అందిస్తూ పర్యాటకులకు త్రిరత్న వందనం మహాస్థూప పరిక్రమల్లో శిక్షణ నిచ్చిన ఇండియన్-థాయ్ బౌద్ధభిక్షువు అరుణోదేరకు బుద్ధవనం ప్రత్యేకాధికారి మల్లెపల్లి లక్ష్మయ్య ఆదివారం ఘనంగా వీడ్కోలు పలికారు. బౌద్ధభిక్షువును చీవరాలతో సత్కరించారు. అంతకుముందు దాదాపుగా 100 మంది బౌద్ధ పాసకులకు ధమ్మ ప్రవచనం ఇచ్చి విపస్సన ధ్యానాన్ని చేయించి, పరిక్రమం చేయించారు. కార్యక్రమంలో బుద్ధవనం బుద్ధిస్ట్ నిపుణుడు కన్సల్టెంట్ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి, ఓఎస్‌డీ సుధన్‌రెడ్డి పాల్గొన్నారు.

పంట నష్టం రూ. 7.82 కోట్లు

ఈదురు గాలులు, వడగండ్లకు దెబ్బతిన్న పంటలు



వలిగొండ మండలంలోని ఎం. తుర్కపల్లిలో రాలిన వడ్లు

- వరి 4,282, మిర్చి ఎకరం, మామిడి 60 ఎకరాల్లో నష్టం
- పలుచోట్ల దెబ్బతిన్న ఇళ్లు
- పెద్దపడిశాలలో పౌల్ట్రీఫాం కూలి మృతి చెందిన కోడి పిల్లలు
- బాధిత ప్రాంతాల్లో పర్యటించిన అధికారులు
- నష్టంపై ప్రాథమిక అంచనాలు.. ప్రభుత్వానికి నివేదిక

సాక్షి, యాదాద్రి : జిల్లాలో శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షం అన్నదాతకు అపారనష్టం మిగిలిచ్చింది. ఈదురుగాలులు, వగడండ్లకు పొట్ట దశలో ఉన్న వరి నేలవాలింది. మామిడి పూత, కాయ రాలిపోయింది. వరి 4,282 ఎకరాలు, మిరప ఎకరం, మామిడి 60 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు.

ఎక్కువగా ఈ మండలాల్లో..
ఆత్మకూర్(ఎం), మోత్కూరు, అడ్డగూడురు, గుండాల మోటకొండూరు, వలిగొండ, తుర్కపల్లి, భువనగిరి, యాదగిరిగుట్ట, చౌటుప్పల్, రామన్నపేట మండలాల్లో పంట నష్టం తీవ్రత ఎక్కువగా ఉంది. జిల్లాలో ఈ యాసంగి సీజన్‌లో రికార్డు స్థాయిలో 2.94 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. ముందుగా నాట్లు వేసి వరి కోతకు వస్తోంది. ఎక్కువ శాతం పొట్టదశలో ఉంది. ఇప్పటికే అగ్గి తెగులు తదితర చీడపీడలు ఆశించి దిగుబడిపై ప్రభావం చూపే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు భావిస్తున్నారు. తాజాగా కురిసిన వడగండ్ల వర్షం తీరని నష్టం మిగిల్చింది. చాలా చోట్ల పొలాలు నేలవాలడంతో పాటు కంకులు విరిగిపోయాయి. మామిడి తోటలు పూత, కాత రాలిపోయాయి. అంతంతమాత్రంగా కాసిన కాయలు ఈదురుగాలులు, వడగండ్లకు 50 శాతం రాలిపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వలిగొండ మండలం మొగిలిపాకలో నేలరాలిన మామిడికాయల వద్ద దిగాలుగా రైతు

పంట నష్టం (ఎకరాల్లో)	
వరి	4,282
మామిడి	60
మిరప	01
రైతులు	2012
నష్టం	రూ.7.82 కోట్లు

ప్రభుత్వానికి నివేదిక
వ్యవసాయయ, ఉద్యానవన శాఖ అధికారులు అకాల వర్షానికి దెబ్బతిన్న పంటలను పరిశీలించి నష్టంపై ప్రాథమిక అంచనా వేశారు. 1,992 మంది రైతులకు చెందిన 4,282 ఎకరాల్లో వరి, ఏడుగురు రైతులకు చెందిన 60 ఎకరాల్లో మామిడి, 13 మంది రైతులకు ఎకరం మిర్చి దెబ్బతిన్నట్లు గుర్తించారు. రూ.7.82 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు తేల్చారు. ఈ మేరకు ప్రభుత్వానికి నివేదిక పంపించారు. కానీ, సుమారు 15 వేల ఎకరాల్లో వరి, 300 ఎకరాల్లో మామిడి తెలుస్తోంది. వీటితో పాటు టమాట ఇతర పంటలకు నష్టం వాటిల్లింది.

ఆస్తినష్టం ఇలా..
ఆత్మకూరు(ఎం) మండలంలోని సింగారం, మొరిపిరాల, తుర్కలరేపాకలో పలు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి. పుల్లాయిగూడెంలో షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో ఓ ఇంట్లో ఫ్రిజ్, వంట సామగ్రి, బియ్యం, దుస్తులతో పాటు రూ.10 వేల నగదు దగ్ధమయ్యాయి.గుండాల మండలం పెద్దపడిశాలలో పౌల్ట్రీఫామ్ కూలిపోయింది. సుమారు 1,200 కోడి పిల్లలు మృతిచెందాయి. సుమారుగా రూ.2 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు యజమాని తెలిపాడు.



చౌటుప్పల్ మండలం మందోళ్లగూడెంలో రాలిన టమాట

మండలాల వారీగా కురిసిన వర్షం
శనివారం ఉదయం నుంచి ఆదివారం ఉదయం 8గంటల వరకు జిల్లాలో సరాసరి 43.2 మిల్లీ మీటర్ల వర్షపాతం కురిసింది. అత్యధికంగా యాదగిరిగుట్ట మండలంలో 76.8 మి.మీ కురిసింది. భువనగిరి మండలంలో 71.4, బొమ్మలరామారం 66.4, బీబీనగర్ 45.6, గుండాల 38.8, ఆలేరు 32.4, ఆత్మకూర్(ఎం) 24.6, మోత్కూరు 23.8, తుర్కపల్లి 22.6, రాజాపేట 16.6, భూదాన్‌పోచంపల్లి 12.4, రామన్నపేటలో 0.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.



గుండాల మండలం పెద్దపడిశాలలో పౌల్ట్రీషెడ్ కూలడంతో మృతి చెందిన కోడి పిల్లలు

నిరుద్యోగులను మోసం చేస్తున్న కేసీఆర్

- డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరిటౌన్ : పరీక్షలను కూడా సమర్థవంతంగా నిర్వహించలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. టీఎస్‌పీఎస్సీ పరీక్ష ప్రశ్న పత్రాల లీకేజీ కారకులపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం భువనగిరిలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. నిరుద్యోగులు గత కొన్ని నెలలుగా లక్షల రూపాయలు వెచ్చించి పోటీ పరీక్షలకు సిద్ధం అవుతున్నారని పేర్కొన్నారు. పరీక్ష రద్దు చేయడంతో వారంతా నష్టపోయే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం ఆడుతుందని దుయ్యబట్టారు. కేసీఆర్‌ను ఫ్లెక్సీని దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.ఈ క్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ పోత్నక్ ప్రమోద్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్మన్ బర్రె జహంగీర్ దుస్తులు చిరిగిపోగా, యువజన కాంగ్రెస్ భువనగిరి అసెంబ్లీ అధ్యక్షుడు అవైస్‌చిస్తీ చేతికి స్వల్ప గాయమైంది. బీఆర్‌ఎస్ పాలనలో నిరసన తెలిపే హక్కు కూడా లేకుండా పోయిందని కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తంగళ్లపల్లి రవికుమార్, బీసుకుంట్ల సత్యనారాయణ,ఈరపాక నర్సింహ, పడిగెల ప్రదీప్, మహేందర్, హరిప్రసాద్, కొల్లూరు రాజు తదితరులు పాల్గొన్నారు.



భువనగిరిలో ముఖ్యమంత్రి కేసీఆర్ ఫ్లెక్సీ దహనం చేస్తున్న కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, కార్యకర్తలు

సండే రద్దీ

చౌటుప్పల్ : హైదరాబాద్ – విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం వాహనాల రద్దీ నెలకొంది. సెలవు రోజు, శుభకార్యాలు అధికంగా ఉండడంతో ప్రజలు పెద్ద సంఖ్యలో రాకపోకలు సాగించారు. ఈ క్రమంలో చౌటుప్పల్‌లో కూడా రద్దీ ఏర్పడింది. దీనికి తోడు వారాంతపు సంత ఉండడంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. ఆర్టీసీ బస్‌స్టేషన్, తంగడపల్లి రోడ్డు, వలిగొండ జంక్షన్ వద్ద రోడ్డు దాటేందుకు అవస్థలు పడ్డారు.



దేశ స్వాతంత్ర్యానికి ప్రతిబింబం ‘మల్లు’



మల్లు స్వరాజ్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు, ఎంపీ బడుగుల, చెరుపల్లి సీతారాములు తదితరులు

- స్వరాజ్యం వర్ధంతి సభలో మంత్రి జగదీశ్‌రెడ్డి
- పాల్గొన్న సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు తదితరులు

సూర్యాపేట రూరల్ : దేశ స్వాతంత్ర్యానికి ప్రతిబింబం మల్లు స్వరాజ్యం అని విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. ఆదివారం రాయినిగూడెంలో ఏర్పాటు చేసిన మల్లు స్వరాజ్యం ప్రథమ వర్ధంతి సభకు ఆయన హాజరై మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అరాచకాలను ఎదిరించడంలో స్వరాజ్యం చూపిన తెగువ ఎనలేనిదని కొనియాడారు. నేటి యువతరానికి ఆమెలాంటి యోధుల జీవితాలు స్ఫూర్తిదాయకమన్నారు. బీజేపీ పాలనలో పేదవారు మరింత పేదవారుగా మారుతునన్నారని దుయ్యబట్టారు. మోదీ ప్రధాని అయ్యాక అభివృద్ధి సూచీలో దేశం మరింతగా దిగజారిందని విమర్శించారు. బీజేపీని దేశం నుంచి పారదోలే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. సీఎం కేసీఆర్ చేయబోయే పోరాటంలో వెన్నుదన్నుగా నిలబడాలని పిలుపునిచ్చారు.

నైజాం సర్కారును గడగడలాడించిన వీర వనిత
సీపీఐ(ఎం)పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ.రాఘవులు మాట్లాడుతూ హైదరాబాద్ సంస్థానం విముక్తి కోసం సాయుధ గెరిల్లా రైతాంగ పోరుతో నైజాం సర్కారును గడగడలాడించిన వీరవనిత మల్లు స్వరాజ్యం అన్నారు. ఆడవాళ్లు అబలలు కాదు.. సబలలు అని నిరూపించిన యోధురాలు అని కొనియాడారు. తెలంగాణలో మత సామరస్యాన్ని చెడగొట్టి మతోన్మాదాన్ని పెంచి పోషించాలన్న బీజేపీ శక్తులను అడ్డుకోవడానికి లౌకిక వాదులు, అన్ని రాజకీయ పార్టీలు భాగస్వామ్యం కావాలన్నారు. ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్ మాట్లాడుతూ మల్లు స్వరాజ్యం తెలంగాణ సమాజానికి స్ఫూర్తిదాయకమైన వ్యక్తి అని అన్నారు. తెలంగాణలో తుపాకీ పట్టిన మొట్టమొదటి మహిళగా కీర్తి గడించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్.పుణ్యవతి, చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డి, ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘డబుల్’ విచారణ!

- భువనగిరిలో ఇళ్ల జాబితాపై వెల్లువెత్తిన ఫిర్యాదులు
- 687 మంది నుంచి అభ్యంతరాలు
- అనర్హులను ఎంపిక చేశారంటూ దరఖాస్తుదారుల ఆవేదన
- మరోసారి విచారణకు ఆదేశించిన కలెక్టర్



బాక్సులో అభ్యంతరాల పత్రాలను వేస్తున్న బాధితులు

భువనగిరిటౌన్ : పట్టణంలోని సింగన్నగూడెం వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ కోసం మరోసారి విచారణ చేపట్టనున్నారు. అర్హుల జాబితాపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు, ఫిర్యాదులు వెల్లువెత్తిన నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి దరఖాస్తుదారుల వివరాలు సేకరించనున్నారు. మొత్తం 444 ఇళ్లకు గాను 3,593 దరఖాస్తులు వచ్చాయి. ప్రత్యేక బృందాలు ఇటీవల ఇంటింటికి వెళ్లి వివచారణ చేపట్టారు. ఈ నెల 18వ తేదీన వార్డుల వారీగా సభలు ఏర్పాటు చేసి అర్హులు, అనర్హుల జాబితా విడుదల చేశారు. 1,605 మందిని అర్హులుగా, 1,988 మంది అనర్హులుగా గుర్తించారు.

మరోసారి జాబితా రూపకల్పన
అధికారులు విడుదల చేసిన అర్హుల జాబితాపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు రావడంతో మరోసారి విచారణ కోసం ప్రత్యేకంగా 12 బృందాలను ఏర్పాటు చేశారు. వీరు రెండు రోజుల పాటు ఇంటింటికి వెళ్లి క్షుణ్ణంగా వివరాలు సేకరించి లబ్ధిదారుల జాబితా తయారు చేయనున్నారు. ఈ నెల 22న జాబితాలను ప్రదర్శిస్తారు.

రిజర్వేషన్ ప్రకారంగా..
తుది జాబితా అధారంగా లబ్ధిదారుల ఎంపిక ఉంటుంది. భువనగిరి మున్సిపాలిటీ మొత్తాన్ని ఒక యూనిట్‌గా తీసుకొని డ్రా నిర్వహిస్తారు. 444 ఇళ్లలో 17 శాతం ఎస్సీ, 7 శాతం ఎస్టీ, 12 శాతం మైనార్టీలు, 5 శాతం దివ్యాంగులు, 2 శాతం మాజీ సైనిక ఉద్యోగులకు కేటాయిస్తారు. మిగిలిన ఇళ్లను అన్ని వర్గాలకు పంపిణీ చేసేందుకు డ్రా తీస్తారు.

నేడు కలెక్టర్‌ను కలవనున్న ప్రతిపక్షాలు
డబుల్ బెడ్‌రూం ఇళ్ల జాబితాపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరుతూ ప్రతిపక్ష నాయకులు సోమవారం కలెక్టర్‌ను కలవనున్నట్లు తెలిసింది. అధికారులు చేపట్టిన సర్వే పారదర్శకంగా లేదని, అనర్హులు ఎక్కువగా ఉన్నారని వారు ఆరోపిస్తున్నారు.మరోసారి సర్వే చేపట్టి తుది జాబితా రూపొందించాలని వినతిపత్రం ఇవ్వనున్నారు.

అర్హులకు అన్యాయం



రోజు కూలి పని చేసుకునే వారిని, కిరాయికి ఉంటున్న నిరుపేదల పేర్లు జాబితాలో లేవు. సర్వే బృందాలు ఇంటింటికి వెళ్లకుండా ఎక్కడో ఉండి రాసుకొని పోయారు. జాబితాలో చాలా మంది అనర్హులు ఉన్నారు. ముందుగా ఆరిని గుర్తించాలి.మరోసారి ఇంటిటి సర్వే చేపట్టి తుది జాబితా విడుదల చేయాలి.

– పోతంశెట్టి మంజుల
మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్

ఆర్డీఓ పర్యవేక్షణలో విచారణ
భువనగిరిటౌన్ : డబుల్ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ కోసం మరోసారి సర్వే చేయించనున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం రూపొందించిన జాబితాపై 687 మంది అభ్యంతరాలు తెలియజేశారని, భువనగిరి ఆర్డీఓ ఎంవీ భూపాల్‌రెడ్డి పర్యవేక్షణలో రెండోసారి విచారణ చేయించనున్నట్లు పేర్కొన్నారు. విచారణ సమయంలో అర్జీదారులు అందుబాటులో ఉండాలని అధికారులు అడిగిన సమాచారం ఇవ్వాలన్నారు. ఇంకా ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే నేడు, రేపు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రెండు జాబితాల్లో పేరు లేదు



మేము కులాంతర వివాహం చేసుకొని జీవనం సాగిస్తున్నాం. 12 ఏళ్లుగా అద్దె ఇంట్లో ఉంటున్నాం. ప్రతి నెలా రూ.3,500 చెల్లిస్తున్నాం. డబుల్ బెడ్ రూం ఇంటికి దరఖాస్తు చేసుకున్నా జాబితాలో పేరు లేదు. అనర్హుల జాబితాలో కూడా లేదు. ఉమ్మడి కుటుంబాల్లో అన్నదమ్ముల పేర్లు వచ్చాయి. కులాంతర వివాహం చేసుకున్న తమకు రిజర్వేషన్ కల్పించాలి.

– కె.ధనలక్ష్మి, మధార్, దంపతులు

క్లుప్తంగా

కంప్యూటర్, అకౌంట్స్ అసిస్టెంట్ జిల్లా కమిటీ ఎన్నిక



ఎన్నికైన కంప్యూటర్ అండ్ అకౌంట్స్ అసిస్టెంట్ నల్లగొండ జిల్లా కమిటీ

నల్లగొండ : డీఆర్‌డీఏలోని మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కంప్యూటర్ అండ్ అకౌంట్స్ అసిస్టెంట్ నల్లగొండ జిల్లా కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సయ్యద్ రఫీ, కార్యదర్శిగా సింగం రమేష్ ఎన్నికయ్యారు. సభ్యులుగా కృష్ణమాచారి, భోజ్యానాయక్, కుర్షిద్ అలీ, చంద్రకళ, సునంధ, శ్రీదేవి, ఫిరోజ్, సత్యం, నర్సింహ, బాలు, సాయి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వృద్ధుడు మృతి

కేతేపల్లి: మండల కేంద్రంలో వారం క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కేతేపల్లికి చెందిన జంటగి భిక్షమయ్య(70) ఈనెల 13న స్థానిక చర్చి సమీపంలో జాతీయ రహదారిని దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టింది. ఈప్రమాదంతో భిక్షమయ్య తలకు బలమైన గాయాలుకాగా అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు భిక్షమయ్యను మొదట సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి, అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి, అక్కడి నుంచి నార్కట్‌పల్లి కామినేనికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. మృతదేహానికి స్థానిక పోలీసులు ఆదివారం నకిరేకల్ ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

టెన్త్ విద్యార్థినులకు ప్రేరణ తరగతులు



పరీక్ష ప్యాడ్లు అందిస్తున్న ఎస్సీ అభివృద్ధి శాఖ డీడీ సల్మాబాను

నల్లగొండ : నల్లగొండలోని డీఈఓ కార్యాలయంలో వద్ద ఉన్న బాలికల హాస్టల్‌లో పదో తరగతి విద్యార్థినులకు ఆదివారం ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ డీడీ సల్మాబాను ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పదో తరగతి విద్యార్థినులు ఎలాంటి భయాందోళనకు గురి కాకుండా పరీక్షలు రాయాలన్నారు. అధిక మార్కులు సాధించి తల్లిదండ్రుల ఆశలను నిలబెట్టడంతోపాటు సంక్షేమ హాస్టళ్ల సత్తా ఎంటో చూపించాలని చెప్పారు. అనంతరం వారికి పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, జామెట్రీబాక్స్‌లను అందించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ గోపాలకృష్ణ, ఇన్‌చార్జ్ ఏఎస్‌డబ్ల్యూఓ డి.స్వామి, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు సత్యవతి పాల్గొన్నారు.

విధిరాతకు ఎదురీత

- నలుగురు ఆడపిల్లలు పుట్టుమూగ, చెవుడు
- మొక్కవోని ధైర్యంతో పెంచి పెద్దచేసిన తల్లిదండ్రులు
- చదువులో రాణిస్తున్న విధివంచితులు



దివ్యాంగులైన నలుగురు అక్కాచెల్లెళ్లు

సాధారణంగా కుటుంబంలో ఒక్కరు దివ్యాంగులుగా పుడితేనే ఆ బాధను భరించలేం. అలాంటిది పుట్టిన నలుగురు సంతానం కూడా ఆడపిల్లలే. అందులోనూ వారు పుట్టు దివ్యాంగులు. కుమార్తెలు మాట్లాడలేకపోవడం, వినలేకపోవడంతో ఆ తల్లిదండ్రుల బాధ వర్ణాణాతీతం. బాధలన్నీ కూడబలుక్కొని ఆ కుటుంబాన్ని కబలించినా మొక్కవోని ధైర్యంతో ఎదురొడ్డి పోరాడుతున్నారు. దివ్యాంగులైన తమ నలుగురు పిల్లలను చూసి కుంగిపోకుండా వారిని ఉన్నతంగా తీర్చిదిద్దడానికి కష్టపడుతున్నారు. ఆ పిల్లలు కూడా చదువులో రాణిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగుతున్నారు.

సాక్షి నల్లగొండ డెస్క్: శాలిగౌరారం మండలంలోని ఎన్‌జీ కొత్తపల్లి గ్రామానికి చెందిన గూడపూరి దాసు– రేణుక దంపతులకు 26 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. వారిది మేనరికపు సంబంధం. గ్రామంలో ఉన్న రెండెకరాల వ్యవసాయ భూమిలో పంటలను సాగుచేసుకోవడంతో పాటు నిత్యం వ్యవసాయ పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆ దంపతులకు నలుగురు ఆడ సంతానం. పెద్దకుమార్తె ఆగ్నస్, రెండో కుమార్తె అర్చన, మూడో కుమార్తె అనూష, నాలుగవ కుమార్తె అక్షయ. ఈ నలుగురూ పుట్టుకతోనే మూగ, చెవుడు.

అందరూ విద్యావంతులే..

ఆ నలుగురు పుట్టుకతో దివ్యాంగులైనప్పటికీ చదువులో మాత్రం రాణిస్తూ సహచర విద్యార్థులకంటే ముందుంటున్నారు. ఒకపక్క కుటుంబాన్ని పేదరికం వెంటాడుతున్నా ఆ తల్లిదండ్రులు అధైర్య పడకుండా అందరి పిల్లల మాదిరిగానే తమ పిల్లలను కూడా బాగా చదివించాలనే దృఢ సంకల్పంతో కూలి పనులు చేసుకుంటూనే ఉన్నత చదువులు చదివిస్తున్నారు. పెద్దకుమార్తె ఆగ్నస్ ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఉపాధివేటలో భాగంగా టైలరింగ్, బ్యూటీపార్లర్ విభాగాల్లో శిక్షణ పూర్తిచేసింది. రెండో కుమార్తె అర్చన డిగ్రీ(బీఏ) విద్య పూర్తిచేసి టైపింగ్, కంప్యూటర్ విభాగాల్లో శిక్షణ పొందింది. మూడో కుమార్తె అనూష ప్రస్తుతం హైదరాబాద్‌లో డిగ్రీ(బీకాం, కంప్యూటర్) ఫైనల్ ఇయర్ చదువుతుండగా నాలుగో కుమార్తె అక్షయ మిర్యాలగూడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఈ నేపథ్యంలో కుమార్తెలను ప్రయోజకులుగా చేయాలనే తపనతో వారి తల్లిదండ్రులు పడుతున్న కష్టాలు అన్నీఇన్నీ కావు.

బిడ్డలను ప్రయోజకులను చేస్తా



అమ్మాయిలైన, అబ్బాయిలైన ఒక్కటే అనుకున్నా. విధి వక్రీకరించడంతో నా కుమార్తెలు దివ్యాంగులయ్యారు. వారిని మంచి ప్రయోజకులుగా తీర్చిదిద్దడమే నా ధ్యేయం. అందుకోసం ఎన్ని కష్టాలైనా ఎన్ని బాధలైనా పడతా. ఎంతకష్టపడినా నా బిడ్డల కోసమే. వారికి మంచి భవిష్యత్‌ను చూపాలన్నదే నా తపన.

– గూడపూరి దాసు, తండ్రి

పిల్లలను చూస్తుంటే గుండె తరుక్కుపోతోంది



కళాశాలలకు సెలవులు వచ్చినప్పుడు పిల్లలు ఇంటికి వస్తారు. అప్పుడు మేము చేప్పేది వారికి అర్థం కాదు. వారు చెప్పేది మాకు అర్థం కాదు. వారికి కావాల్సిన వాటి గురించి వారి భాషల్లో సైగల ద్వారా చెబుతుంటే గుండె తరుక్కుపోతుంది. తోటిపిల్లలతో నా బిడ్డలు బయట కాలక్షేపం చేయలేక ఇంటికే పరిమితమవడం చూస్తుంటే ఎంతో బాధ అనిపిస్తది.

– గూడపూరి రేణుక, తల్లి

బతుకు భారమవుతున్నప్పటికీ..

నేటి ఆధునిక సాంకేతిక కాలంలో మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నప్పటికి నేటికీ ఆడపిల్ల అంటేనే భారంగా భావించే పరిస్థితులు. అందులోనూ నలుగురు కుమార్తెలు కావడం.. ఆ నలుగురు కుమార్తెలు దివ్యాంగులు కావడమంటే వారి భవిష్యత్‌ను ఊహిస్తే వారి బతుకు ఎంతో భారమనిపిస్తుంది. అయితే వారికి మంచి భవిష్యత్ అందించాలన్నదే ఆ తల్లిదండ్రుల లక్ష్యం. ప్రస్తుతం తమ పిల్లల విద్యా, వసతి సౌకర్యాల కోసం సంవత్సరానికి రూ. 2.50 లక్షలకు పైగా ఖర్చు వస్తుందని, తమ కష్టానికి తోడు ప్రభుత్వం అందిస్తున్న ఆసరా పింఛన్ తమను కొంత ఆదుకుంటుందని తల్లిదండ్రులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి



సయ్యద్ బాబుమియా (ఫైల్)

గరిడేపల్లి: గరిడేపల్లి, చిట్యాల మండలాల్లో ఆదివారం జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి. నేరేడుచర్లలోని రాజీవన్‌నగర్‌కు చెందిన సయ్యద్ బాబుమియా(70) ఈనెల 17వ తేదీన చివ్వెంల మండల బొక్కలతండా గ్రామంలోని తన కుమార్తె ఇంటికి వెళ్లాడు. తిరిగి అక్కడి నుంచి ఆదివారం ఉదయం బయలుదేరాడు. గరిడేపల్లి మండలం మత్రికుంట గ్రామ శివారులో మిర్యాలగూడ నుంచి గరిడేపల్లి మీదుగా సూర్యాపేట వైపు వెళ్తున్న డీసీఎం వస్తున్న సయ్యద్ బాబుమియా టీవీఎస్ ఎక్సెల్‌ను ఎదురుగా ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అల్లుడు మునీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గరిడేపల్లి ఎస్‌ఐ కొండల్‌రెడ్డి తెలిపారు. మృతుడికి కుమార్తె ఉంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని హుజూర్‌నగర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

భార్య మృతి మరువక ముందే భర్త మృతి

నేరేడుచర్ల: మత్రికుంట వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సయ్యద్ బాబుమియా భార్య అమినాబీ 40 రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. భార్య మృతి మరువక ముందే భర్త మృతి చెందడంతో నేరేడుచర్ల మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌నగర్‌లో విషాదచాయలు నెలకొన్నాయి.

డివైడర్‌ను ఢీకొని..

చిట్యాల: మండలంలోని పెద్దకాపర్తి గ్రామ శివారులో జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. చిట్యాల ఎస్‌ఐ నకిరేకంటి ధర్మా తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ జిల్లాలోని మేడిపల్లికి చెందిన పసల హంద్రీరాజు(30) ద్విచక్రవాహనంపై తన భార్య అంకిత, కుమారుడు ప్రిన్స్ నోయల్(05), కుమార్తె మారినో ప్రిన్సి(03)లతో కలిసి నల్లగొండలోని బంధువుల ఇంటికి వెళ్తున్నాడు. మార్గమధ్యంలో చిట్యాల మండలం పెద్దకాపర్తి గ్రామ శివారులోకి రాగానే జాతీయ రహదారి పక్కన గల డివైడర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హంద్రీరాజు తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. భార్య అంకిత, కుమార్తె మారినో ప్రిన్సికు స్వల్ప గాయాలుకాగా.. కుమారుడు ప్రిన్స్ నోయల్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించగా.. అక్కడే మృతిచెందాడు. వీరి మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం నల్లగొండలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఇద్దరిపై పీడీ యాక్ట్ నమోదు

బీబీనగర్: మండలంలోని రాఘవాపురం గ్రామ పరిధిలో ఓ ప్లాటుపై నకిలీ పత్రాలు సృష్టించి విక్రయించిన ఇద్దరు వ్యక్తులపై రాచకొండ సీపీ చౌహాన్ పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు ఎస్‌ఐ సైదులు ఆదివారం తెలిపారు. బీబీనగర్ మండలంలోని రాఘవాపురం గ్రామానికి చెందిన దొంతిరెడ్డి సత్తిరెడ్డి తనకు పరిచయం ఉన్న కీసర మండలం చీర్యాల గ్రామానికి చెందిన దాడి ధర్మేందర్‌రెడ్డితో కలిసి ఢిల్లీకి చెందిన ఖురాన్‌కు సంబంధించిన రెండు ప్లాట్లపై కన్నేశాడు. ఖురాన్ ఢిల్లీలో ఉండడంతో ఎక్కువగా ప్లాట్లను చూసుకోవడానికి రాలేకపోయాడు. ఇదే అదునుగా భావించిన సత్తిరెడ్డి ప్లాట్ల వైపు ఎవరూ రాకపోవడంతో వాటికి నకిలీ పత్రాలు సృష్టించి విక్రయించేందుకు పన్నాగం పన్నాడు. సత్తిరెడ్డి తనకు తెలిసిన వ్యక్తి అయిన ధర్మేందర్‌రెడ్డితో కలిసి ప్లాట్లపై నకిలీ పత్రాలు సృష్టించి రిజిస్ట్రేషన్ ఆఫీస్ నుంచి జీపీఏ పొందారు. అనంతరం వాటిని ఇద్దరు కలిసి ఓ వ్యక్తికి రూ.60లక్షలకు విక్రయించారు. గత కొద్ది రోజుల క్రితం ప్లాట్లను చూడటానికి వచ్చిన అసలు యజమానికి ఖురాన్ విషయం తెలుసుకొని పోలీసులను ఆశ్రయించాడు. దీంతో పోలీసులు విచారణ చేపట్టగా సత్తిరెడ్డి, ధర్మేందర్‌రెడ్డిలు మోసానికి పాల్పడినట్లు తేలడంతో అరెస్టు చేసి జైలుకు తరలించారు. వీరికి సహకరించిన మరో 5మందిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేశారు. కాగా సత్తిరెడ్డి, ధర్మేందర్‌రెడ్డిలు పలుమార్లు ఇలాంటి మోసాలకు పాల్పడి, జైలుశిక్షలు అనుభవించినప్పటికీ వారిలో మార్పు రాకపోవడంతో సీపీ వారిపై పీడీయాక్ట్ నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆందోళనకరంగానే యశ్వంత్ ఆరోగ్యం



నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యశ్వంత్

శాలిగౌరారం: చివ్వెంల మండలంలోని ప్రభుత్వ బీసీ గురుకుల పాఠశాలలో ఐదు రోజుల క్రితం నీటి సంపు గోడ కూలిన ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన శాలిలింగోటం గ్రామానికి చెందిన కొప్పుల యశ్వంత్(10) ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగానే ఉన్నట్లు కుటుంబసభ్యులు ఆదివారం తెలిపారు. ఈ ప్రమాదఘటనలో ముగ్గురు విద్యార్థులకు తీవ్ర గాయాలు కావడంతో వారిలో ఒకరు మృతిచెందగా మరో ఇద్దరు సూర్యాపేట ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో యశ్వంత్ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో సంబంధిత అధికారులు, తల్లిదండ్రులు యశ్వంత్‌ను హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి అదేరోజు రాత్రి తరలించారు. యశ్వంత్ కుడికాలు పాదం పూర్తిగా తెగి నుజ్జునుజ్జు అయింది. తెగి దెబ్బతిన్న కాలు పాదాన్ని అతికించేందుకు అనేక పర్యాయాలు పరీక్షించిన సంబంధిత వైద్య నిపుణులు శస్త్ర చికిత్స సాధ్యం కాకపోవడంతోపాటు శస్త్ర చికిత్స చేసినా భవిష్యత్‌లో ఏర్పడే ఆరోగ్య సమస్యలను దృష్టిలో పెట్టుకొని యాంకిల్ పైభాగం వరకు తొలగించారు. ప్రస్తుతం యశ్వంత్ వెంటిలేటర్‌పై ఉన్నాడు.

యాదాద్రిలో భక్తుల రద్దీ



ప్రధానాలయంలో నెలకొన్న భక్తుల రద్దీ



ఆలయ క్యూలైన్లలో భక్తులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. ఆదివారం సెలవు రోజు కావడంతో భక్తుల సంఖ్య పెరిగింది. జంట నగరాలతో పాటు ఆయా రాష్ట్రాల నుంచి భక్తులు అధికంగా రావడంతో ఆలయమంతా సందడిగా మారింది. ఆలయ పరిసరాలు, క్యూలైన్లు, ప్రసాదం విక్రయశాల, లక్ష్మీ పుష్కరిణి, కల్యాణ కట్ట వంటి ప్రాంతాల్లో భక్తులు అధికంగా కనిపించారు. బ్రేక్ దర్శనాలు, మధ్యాహ్నం ఆరగింపు సమయాల్లో భక్తులు క్యూలైన్లలో నిలిచారు. శ్రీస్వామి వారి ధర్మ దర్శనానికి రెండున్నర గంటలు, వీఐపీ దర్శనానికి 45నిమిషాల సమయం పట్టింది. శ్రీస్వామి వారిని 35వేలకు పైగా భక్తులు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు.

వివిధ పూజలతో..

శ్రీస్వామి వారికి వివిధ పూజలతో నిత్య ఆదాయం రూ.37,44,333 వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ప్రధాన బుకింగ్‌తో రూ.2,87,000, కైంకర్యాలతో రూ.8,800, సుప్రభాతంతో రూ.8,600, పుష్కరిణితో రూ.1,500, వ్రతాలతో రూ.1,92,800, ప్రచార శాఖతో రూ.21,110, వీఐపీ దర్శనాలతో రూ.2,25,000, యాదరుషి నిలయంతో రూ.1,61,400, ప్రసాద విక్రయంతో రూ.15,40,350, పాతగుట్ట ఆలయంతో రూ.66,350, కల్యాణ కట్టతో రూ.1,15,000, శాశ్వత పూజలతో రూ.45,000, వాహన పూజలతో రూ.17,700, కొండపైకి వాహనాల ప్రవేశంతో రూ.5,00,000, సువర్ణ పుష్పార్చనతో రూ.1,34,116, వేద ఆశీర్వచనంతో రూ.14,400, శివాలయంతో రూ.6,900, అన్నదానంతో రూ.44,546, బ్రేక్ దర్శనాలతో రూ.2,24,700, ఇతర పూజలతో రూ.1,29,061 వచ్చిందని అధికారులు వివరించారు.

గుండెపోటుతో మహిళ మృతి

భువనగిరి : తనకు డబుల్ బెడ్ రూం ఇల్లు రాదేమోనని మనస్తాపం చెంది గుండెపోటుకు గురై ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన ఆదివారం భువనగిరి పట్టణంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం పట్టణంలోని పహాడీనగర్‌కు చెందిన మౌలా బేగం (58) కాలనీలో అద్దె ఇంట్లో ఉంటుంది. ఇటీవల పట్టణంలో డబుల్ బెడ్ రూం ఇళ్ల పంపిణీ కోసం దరఖాస్తు చేసుకుంది. ఇంటింటికి వెళ్లి అధికారులు విచారణ చేశారు. తాజాగా ప్రకటించిన జాబితాలో ఆమె అనర్హుల జాబితాలో పేర్కొన్నందుకు మనస్తాపానికి గురైంది. ఆదివారం గుండెపోటు రావడంతో వెంటనే జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది.

బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియ చేపట్టాలి

సూర్యాపేట రూరల్: నిలిచిపోయిన ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను వెంటనే చేపట్టాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెన్షనర్ల పెండింగ్ బకాయిలను విడుదల చేయాలన్నారు. పండిట్‌లు, పీఈటీలకు ప్రమోషన్లు ఇవ్వాలని కోరారు. ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతిలో చేరే వయస్సును 6 సంవత్సరాలుగా నిర్ణయించడం కార్పొరేట్ విద్యా సంస్థల కోసం తప్ప ప్రభుత్వ పాఠశాలలకు ఉపయోగపడదని, 5 సంవత్సరాలుగానే ఉంచాలన్నారు.

ఇంటి పైకప్పు రేకులు కూలి ఒకరికి గాయాలు



ఈదురుగాలికి కింద పడిన ఇంటి పైకప్పు రేకులు

నార్కట్‌పల్లి: మండలంలోని అమ్మనబోలు గ్రామంలో శనివారం రాత్రి ఈదురు గాలులు వీచడంతో గ్రామానికి చెందిన కొల్లోజు రామాచారి ఇంటి పైకప్పు రేకులు లేచి అతడిపై పడడంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. రామాచారిని చికిత్స నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి యత్నం

సూర్యాపేట రూరల్ : సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జనగాం క్రాస్‌రోడ్‌లో ఉన్న శ్రీవేంకటేశ్వర టౌన్‌షిప్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీకి యత్నించారు. వివరాల ప్రకారం.. కాలనీకి చెందిన గోపగాని నాగయ్య అమెరికాలో ఉంటున్న కుమారుడి వద్దకు నెల రోజుల క్రితం వెళ్లాడు. గుర్తు తెలియని దుండగులు ఇంట్లో చొరబడి బీరువా తాళాలు పగులగొట్టారు. బీరువాలో ఎలాంటి నగదు, ఆభరణాలు బంగారం లేకపోవడంతో వెళ్లిపోయారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.



దొంగలు పగులగొట్టిన ఇంటి తలుపు

బండి సంజయ్‌కి రాజ్యాంగంపై అవగాహన లేదు

- ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



యాదగిరిగుట్టలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

యాదగిరిగుట్ట : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కు రాజ్యాంగం, ప్రజాస్వామ్యం పట్ల అవగాహన లేదని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత విమర్శించారు. ఆదివారం యాదగిరిగుట్టలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కరీంనగర్‌లో బండి సంజయ్‌ను గెలిపించినందుకు అక్కడి ఓటర్లు చాలా బాధపడుతున్నారన్నారు. పరీక్షలు రాసే యువతకు ధైర్యం చెప్పకుండా ఆవేదనకు గురయ్యే విధంగా చేస్తున్నారని మండిపడ్డారు. టీఎస్‌పీఎస్సీలో జరిగిన పొరపాటును రాష్ట్రప్రభుత్వం సరిదిద్దే ప్రయత్నం చేస్తుంటే.. ప్రతిపక్షాలు మాత్రం పెద్దది చేసి, నిరుద్యోగులను ఆవేదనకు గురి చేస్తున్నాయన్నారు. మంత్రి కేటీఆర్‌ను భర్తరఫ్ చేయాలని బండి సంజయ్ అనడంలో అర్థం లేదన్నారు. పేపర్ లీకేజీకి కేటీఆర్‌కు ఏమైనా సంబంధం ఉందా అని ప్రశ్నించారు. బాధ్యతా రాహిత్యమైన మాటలను బీజేపీ మాట్లాడుతుందన్నారు. తెలంగాణకు జరుగుతున్న నష్టం పట్ల, కేంద్ర ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధుల పట్ల బాధ్యత బీజేపీకి లేదని ఆరోపించారు. బీజేపీకి ఉన్న లక్ష్యం ఏంటో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇక టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి మాట్లాడే అర్హత లేదని, ఆయన సంస్కారం మరిచిపోయారని ఎద్దేవా చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పెలిమెల్లి శ్రీధర్‌గౌడ్, జెడ్పీటీసీ తోటకూరి అనురాధ, మున్సిపల్ చైర్‌పర్సన్ ఎరుకల సుధా, రైతు బంధు డైరెక్టర్ మిట్ట వెంకటయ్య, నాయకులు కళ్లెం స్వాతి, గుండ్లపల్లి భరత్‌గౌడ్, గునగంటి బాబురావుగౌడ్, సుడుగు శ్రీనివాస్‌రెడ్డి, మారెడ్డి కొండల్‌రెడ్డి, కొండం అశోక్‌రెడ్డి, పాండవుల భాస్కర్‌గౌడ్, మిట్ట అనిల్‌గౌడ్, ఎరుకల హేమేందర్‌గౌడ్, శివరాత్రి నరేష్, సదా ప్రవీణ్, రజినికాంత్ తదితరులున్నారు.

పశువులు తరలిస్తున్న వాహనం పట్టివేత



డీసీఎంలో తరలిస్తున్న పశువులు

చిట్యాల: రాజమండ్రి నుంచి హైదరాబాద్ వైపునకు 44 పశువులను అక్రమంగా తరలిస్తున్న డీసీఎం వాహనాన్ని చిట్యాలలో ఆదివారం ఉదయం పట్టికున్నట్లు చిట్యాల ఎస్‌ఐ నకిరేకంటి ధర్మా తెలిపారు. వివరాల ప్రకారం.. మేకల శ్రీధర్‌రెడ్డి, మునుగోడు మండలం చీకటిమామిడి గ్రామానికి చెందిన డీసీఎం వాహనం యజమాని పాతూరి శేఖర్ గౌడ్‌లు రాజమండ్రిలోని రాజానగర్‌లో 44 పశువులు (20 ఆవులు, 24 ఎద్దులు) కొనుగోలు చేశారు. వీటిని టీఎస్07 యూకే 4428 డీసీఎం వాహనంలో అనుముల గ్రామానికి చెందిన డ్రైవర్ కొల్లి సైదులు హైదరాబాద్‌లోని కబేలాకు తరలిస్తున్నాడు. సమాచారం తెలుసుకున్న చిట్యాల పోలీసులు ఆదివారం ఉదయం పోలీస్‌స్టేషన్ ఎదుట నిర్వహించిన తనిఖీల్లో పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ పశువులను నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం కర్నేవానిపల్లి గ్రామంలోని గురునాక్ గోశాల ఫౌండేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఆవుల పట్టివేత

కొండమల్లేపల్లి: కొండమల్లేపల్లి మీదుగా డీసీఎంలో హైదరాబాద్‌లోని కబేళాలకు తరలిస్తున్న ఆవులను పోలీసులు పట్టుకున్నారు. కొండమల్లేపల్లి ఎస్‌ఐ వీరబాబు తెలిపిన ప్రకారం.. హైదరాబాద్– నాగార్జునసాగర్ రాష్ట్ర రహదారిపై వాహన తనిఖీల్లో భాగంగా డీసీఎంను తనిఖీ చేశారు. అందులో 11 ఆవులు, రెండు దూడలను గుర్తించి హైదరాబాద్‌లోని గోశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



భువనగిరి: గుర్తు తెలియని వ్యక్తి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన యాదాద్రి రైల్వేస్టేషన్ సమీపంలో ఆదివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 25 నుంచి 30 సంవత్సరాల వయసు గల వ్యక్తి ఆదివారం యాదాద్రి రైల్వే స్టేషన్ సమీపంలోని మైలురాయి 248/5- 7 వద్ద కాజీపేట నుంచి సికింద్రాబాద్‌కు వెళ్తున్న గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం తెలుసుకున్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్ కానిస్టేబుల్ నాగేశ్వర్‌రావు తెలిపారు.

సాగర్‌లో పర్యాటకుల సందడి



మహాస్థూపంలోని ధ్యానమందిరంలో బుద్ధుని విగ్రహాల వద్ద ధ్యానులు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్‌లో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. బుద్ధవనం, నాగార్జునకొండ, ఎత్తిపోతల, కృష్ణాతీరం వెంటగల రోడ్డులో ఉల్లాసంగా గడిపారు. లాంచీలో కొండకు వెళ్లిన పర్యాటకులు మ్యూజియంలోని బుద్ధుని విగ్రహాలు, అలనాటి నదీతీర నాగరికత విశేషాలను తెలుసుకున్నారు. బుద్ధవనంలో జాతకపార్కు, తపోవనం, స్థూపపార్కును సందర్శించారు. మహాస్థూపంలోని ధ్యానమందిరంలో ధ్యానం చేయడంతోపాటు అష్టబుద్ధులను దర్శించారు.